RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

**మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ**

- మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ
- కాంగ్రెస్‌ది విధ్వంస పాలన

2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 48 | మార్చి 06 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 48 | March 06 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


# ప్రధాని మోడీ ఆందోళన

## ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో ఫోన్ సంభాషణ



**న్యూఢిల్లీ, మార్చి 5 జన సంఘర్షణ :**
పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్ మరియు ఇజ్రాయెల్-అమెరికా కూటమి మధ్య జరుగుతున్న భీకర దాడులపై ఇరు నేతలు

మిగతా 2వ పేజిలో..

## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో

# దురుద్దేశం లేదు

### హైకోర్టుకు స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, మార్చి 5 జన సంఘర్షణ :**
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు విన్నవించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరినో వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకునేందుకు ఈ కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని, కేవలం వాస్తవాలను వెలికితీసేందుకే ఈ ప్రక్రియ చేపట్టామని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఈ కమిషన్ నివేదికపై జరిగిన విచారణలో ఏజీ తన వాదనలు వినిపిస్తూ ప్రాజెక్టు వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా జరిగిందని మరియు నిర్మాణంలో అధికార దుర్వినియోగం చోటు చేసుకుందని పేర్కొన్నారు. కమిషన్

మిగతా 2వ పేజిలో..



# ఢీ అంటే ఢీ

- పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు:
- ఇజ్రాయెల్, అమెరికా కూటమికి ధీటుగా బదులిస్తున్న ఇరాన్



**టెహ్రాన్, మార్చి 5 జన సంఘర్షణ :**
పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ మరియు అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా పోరాడుతోంది. ఇటీవల తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందిన తర్వాత ఇరాన్ తన దాడుల తీవ్రతను మరింత పెంచింది. భారీ ఎత్తున క్షిపణుల

మిగతా 2వ పేజిలో..

# రాజ్యసభ బరిలో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

## కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



# 'పది'కి సర్వం సిద్ధం

- తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు
- హాల్‌టికెట్లు విడుదల చేసిన విద్యాశాఖ

**హైదరాబాద్, మార్చి 5 జన సంఘర్షణ**
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలకు రంగం సిద్ధమైంది. తెలంగాణలో మార్చి 14వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16వ తేదీ నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలకు సమయం దగ్గరపడుతుండటంతో అభ్యర్థుల సౌకర్యార్థం రెండు రాష్ట్రాల ఎస్ఎస్‌సీ బోర్డులు గురువారం హాల్‌టికెట్లను విడుదల చేశాయి. గతంలోలాగా కేవలం వెబ్‌సైట్లపైనే కాకుండా ఈసారి సాంకేతికతను జోడించి వాట్సాప్ ద్వారా కూడా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే వినూత్న అవకాశాన్ని అధికారులు

మిగతా 2వ పేజిలో..



## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశంలేదు

**మొదటిపేజీ తరువాయి..** సమర్పించిన నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం వివరించింది. అయితే పిటిషనర్ తరపు న్యాయవాది ఈ వాదనలను తోసిపుచ్చుతూ కమిషన్ పలువురిపై తప్పుడు అభియోగాలు నమోదు చేసిందని వాదించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎక్కడా బిజినెస్ రూల్స్ ఉల్లంఘించలేదని మరియు అన్ని నిబంధనలకు అనుగుణంగానే పనులు జరిగాయని కోర్టుకు తెలిపారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదని, కమిషన్ ఇచ్చిన నోటీసులు కూడా సరైన విధానంలో లేవని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టు స్థల మార్పిడి లేదా అంచనా వ్యయాల విషయంలో ఎవరూ వ్యక్తిగత లబ్ధి పొందలేదని వివరిస్తూ ఈ కమిషన్ నివేదిక చెల్లదని మరియు దానిపై స్టే ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.

# ఢీ అంటే ఢీ

**మొదటిపేజీ తరువాయి..** మరియు డ్రోన్లతో విరుచుకుపడుతూ మధ్య ప్రాచ్య దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి నేతలు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని పేర్కొంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఇజ్రాయెల్ మరియు అమెరికా ఆస్తులే లక్ష్యంగా కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి దాదాపు పది దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడులు చేస్తూ తన ఆయుధ శక్తిని చాటుకుంటోంది. ఇరాన్ వద్ద ఉన్న ఈ అపారమైన ఆయుధ సంపత్తి వెనుక చైనా హస్తం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి. దశాబ్దాలుగా ఇరాన్ తన ఆయుధగారాన్ని నిర్మించుకోవడంలో చైనా కీలక పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా అమెరికా మరియు ఇజ్రాయెల్ దాడులకు ముందే చైనా నుంచి పెద్ద ఎత్తున ఆయుధ సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. ఇరాన్ రక్షణ వ్యూహంలో కీలకమైన షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుండి ఫత్తా క్లాస్ హైపర్ సోనిక్ మిసైల్స్ వరకు చైనా సాంకేతికత లేదా విడిభాగాల సహకారం ఉన్నట్లు రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో ఎక్కువ భాగం స్వదేశీ తయారీవే అయినప్పటికీ, అవి చైనా పాత డిజైన్ల ఆధారంగా రూపొందించినవేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు చైనా తయారుచేసిన సీఎం 302 యాంటీ షిప్ క్షిపణుల కొనుగోలుపై కూడా ఇరు దేశాల మధ్య ఒప్పందం జరిగినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. చైనా మరియు ఇరాన్ మధ్య ఈ రక్షణ బంధం నేటిది కాదు. 1979-1989 కాలంలోనే ఇరాన్‌కు చైనా మొదటిసారి ఆయుధాలను సరఫరా చేసింది. పశ్చిమ దేశాల ఆంక్షల నడుమ కూడా చైనా తన హై-2 మరియు సీ-801 వంటి యాంటీ షిప్ వ్యవస్థలను ఇరాన్‌కు అందించింది. స్టాక్‌హోమ్ పీస్ ఇన్‌స్టిట్యూట్ నివేదికల ప్రకారం ఇరాన్‌కు అతిపెద్ద ఆయుధ సరఫరాదారుల్లో చైనా ఒకటిగా నిలుస్తోంది. గత శుక్రవారం ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌కు మరింత రక్షణ మరియు అత్యాధునిక ఆయుధాల వినియోగంపై చైనా దిశానిర్దేశం చేసినట్లు మధ్యప్రాచ్య మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో యుద్ధం మరింత ముదిరేలా చేస్తున్నాయి.

# ప్రధాని మోడీ ఆందోళన

**మొదటిపేజీ తరువాయి..** తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం పరిష్కారం కాదని, తక్షణమే దౌత్యపరమైన చర్చలు ప్రారంభించి శాంతిని పునరుద్ధరించాలని మోడీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని ప్రధాని స్వయంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకుంటూ.. తన స్నేహితుడు మాక్రాన్‌తో ప్రస్తుత భద్రతా పరిస్థితులపై చర్చించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని తీసుకురావడానికి భారత్ మరియు ఫ్రాన్స్ సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గత కొద్దిరోజులుగా పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి చెందడంతో పరిస్థితి విషమించింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ చేస్తున్న వరుస క్షిపణి మరియు డ్రోన్ దాడులతో గల్ఫ్ దేశాల్లో భారీ ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోడీ ఇప్పటికే పలువురు గల్ఫ్ దేశాధినేతలతో మాట్లాడి దాడులను ఖండించడంతో పాటు, అక్కడ ఉన్న సుమారు కోటి మంది భారతీయ పౌరుల భద్రతపై ఆరా తీశారు. యుద్ధం మరింత విస్తరించకుండా అంతర్జాతీయ సమాజం చొరవ చూపాలని కోరుతూ భారత్ తన దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేసింది. తాజాగా మాక్రాన్‌తో జరిగిన ఈ సంభాషణ ప్రపంచ శాంతి కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నిలుస్తోంది.

## 2027 కల్లా నాంపల్లి స్టేషన్ ఆధునీకరణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మార్చి5 :** హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌ను 2027 చివరికల్లా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ తరహాలో ఆధునిక హంగుల్నీ కల్పిస్తామని వెల్లడించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. తొలి దశలో రూ.327 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, దశల వారీగా స్టేషన్ రూపు రేఖలే మారుస్తామని స్పష్టం చేశారు. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌కు స్కై వాక్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. అలాగే చర్లపల్లిని అత్యాధునకంగా తయారు చేశామని అన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు సాగుతున్నాయని అన్నారు.

# 'పది'కి సర్వం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..** కల్పించారు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్లతో పాటు మొబైల్ ఫోన్ల ద్వారా సులభంగా తమ వివరాలను పొందే వీలుంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం వీలుకాని పక్షంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి కూడా నేరుగా హాల్‌టికెట్లను తీసుకోవచ్చని విద్యాశాఖ స్పష్టం చేసింది.

తెలంగాణ విద్యార్థులు తమ హాల్‌టికెట్ల కోసం 8096958096 నంబర్‌కు వాట్సాప్‌లో సందేశం పంపడం ద్వారా మీ సేవ పోర్టల్ లింక్ పొంది అక్కడ జిల్లా, పాఠశాల పేరు మరియు పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 లేదా లీప్ యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చు. వాట్సాప్‌లో సందేశం పంపిన తర్వాత ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఆప్షన్ ఎంచుకుని అప్లికేషన్ నంబర్ లేదా చైల్డ్ ఐడీ వివరాలను అందిస్తే నిమిషాల వ్యవధిలోనే హాల్‌టికెట్ ఫోన్‌కు చేరుతుంది. రెగ్యులర్, ప్రైవేట్, ఓఎస్‌ఎస్‌సీ మరియు ఒకేషనల్ విభాగాలకు చెందిన విద్యార్థులందరికీ వేర్వేరుగా హాల్‌టికెట్లను వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత వివరాలను సరిచూసుకోవాలని మరియు వాటిని భద్రపరుచుకోవాలని అధికారులు సూచించారు.

# రాజ్యసభ బరిలో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 5 :

తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరపున అభిషేక్ మను సింఘ్వీ మరియు వేం నరేందర్ రెడ్డి తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో సందడి నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఎంపీలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి అభ్యర్థుల పత్రాలను అందజేశారు. తెలంగాణ తరపున రెండోసారి రాజ్యసభకు వెళ్లే అవకాశం రావడం తన అదృష్టమని ఈ సందర్భంగా అభిషేక్ సింఘ్వీ పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరియు కేసీ వేణుగోపాల్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాజ్యసభ అభ్యర్థిగా తన పేరును ఖరారు చేసిన అధిష్ఠానానికి వేం నరేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును అధిష్ఠానం ముందుగానే ఖరారు చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ చేరుకున్నారు. అయితే రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై బుధవారం రాత్రి వరకు తీవ్ర చర్చలు మరియు సంప్రదింపులు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వేం నరేందర్ రెడ్డి పేరును ప్రతిపాదించడంతో పాటు పార్టీలో అందరితో సత్సంబంధాలు ఉన్న ఆయన పేరుపై ఎవరూ అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. దీంతో అధిష్ఠానం సీఎం ప్రతిపాదనకే మొగ్గు చూపి నరేందర్ రెడ్డిని ఖరారు చేసింది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా మొదటి స్థానానికి ఎన్నికైన సింఘ్వీకి ఎలాంటి ఇబ్బంది లేకపోయినప్పటికీ, రెండో స్థానానికి తగినంత మెజార్టీ కోసం కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం మద్దతుపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన నేపథ్యంలో, ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దించకపోతే ఈ రెండు స్థానాలు కాంగ్రెస్‌కు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.

## గణపతి లొంగిపోతున్నట్లుగా ప్రచారం

### సొంతూరులోనూ వార్తలపై ప్రజల ఆసక్తి

**జగిత్యాల, మార్చి5 :** మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామం బీర్‌పూర్ బుధవారం రాత్రి టెన్షన్ వాతావరణం నెలకొంది. మావోయిస్టు అగ్రనేత ఢిల్లీలో లొంగిపోతున్నాడని వార్తలు రావడంతో గ్రామంలో ఒకేసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. గ్రామంలోని వృద్ధులు, యువకులు, మహిళలు ఆసక్తితో టీవీల వద్ద కూర్చొని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిగా ఉండి ఉద్యమాల్లోకి వెళ్లిన గణపతి ఇప్పుడు ఎలా ఉన్నాడో చూడాలనే ఆత్రుతతో బీర్‌పూర్ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ముప్పాల లక్ష్మన్‌రావ్ అలియాస్ గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్ గ్రామంలో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆద్వర్యంలో అంతర్మథనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఎస్పీ శివకుమార్ బస చేశారు. వేదికపై గణపతి లొంగిపోవాలని జనస్రవంతిలో కలవాలని ఎస్పీ ఆహ్వానించారు.

అయితీఏ సిఎం రేవంత్ బుధవారం ఢిల్లీ వెళ్లడం, హోంమంత్రి అమిత్ షాను క లిసిన సందర్భంలో నక్సల్స్ లొంగుబాటుపై చర్చించారు. ఇటీవల లొంగిన నక్సల్స్ వివరాలు అందించారు. అందులో ప్రముఖులు ఉన్నారు. ఈ క్రమంలో గణపతి కూడా లొంగిపోతాడని, పోలీసుకలు టచ్‌లోకి వచ్చాడని ప్రచారం సాగింది.

## ఉమ్మడి గోదావరిలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

### నేడు రాజమండ్రికి చేరుకోనున్న కిశోర్ మక్వానా

**రాజమహేంద్రవరం, మార్చి5 :** జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఛైర్మన్ కిషోర్ మక్వానా మార్చి 6వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రానున్నారని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, ఓఎన్‌జీసీ అతిథి గృహంలో రాత్రి బస చేస్తారు. శనివారం ఉదయం 11:00 గంటలకు తూర్పు గోదావరి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక అభివృద్ధి మరియు రక్షణాత్మక చర్యలపై కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ మరియు ఇతర ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ధవళేశ్వరం వర్క్‌షాప్‌లో, ఓఎన్‌జీసీ ప్రాంగణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం మరియు ఓ ఎన్ జి సి అధికారుల సమావేశంలో పాల్గొంటారు. తదుపరి వివిధ అధికారిక సమావేశాలు

## మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

### మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ

### కాంగ్రెస్‌ది విధ్వంస పాలన

### నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కెటిఆర్ బృందం

హైదరాబాద్, మార్చి5 : మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

## నితీశ్ కుమార్ సంచలన నిర్ణయం

### రాజ్యసభకు వెళ్లనున్నట్లు ప్రకటన

### బీహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి

### బిజెపికి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి

**పాట్నా, మార్చి5 :** జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు వెళ్లనున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'ఎక్స్' వేదికగా ధృవీకరించారు. దీంతో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్టు సంకేతాలు వస్తున్నాయి. ఇప్పటివరకు తాను మూడు సభల్లో సభ్యుడిగా ఉన్నానని, రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించి 'నాలుగు సభల క్లబ్'లో చేరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. 'రెండు దశాబ్దాలుగా మీరు నన్ను నమ్మి ఎంతో మద్దతిచ్చారు. అంకితభావంతో నా నేను విధుల్ని నిర్వర్తించాను. మీ మద్దతు, నమ్మకం వల్లే బిహార్ అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. నా పార్లమెంటరీ జీవితం ప్రారంభించినప్పటి నుంచి నా మనసులో ఓ కోరిక ఉంది. రాష్ట్ర స్థాయిలో రెండు చట్టసభలతో పాటు పార్లమెంట్‌లోని ఉభయ సభలకు ప్రాతినిధ్యం వహించాలనుకున్నాను. అందుకే త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిగా నా ప్రయాణాన్ని ప్రారంభించాలి అనుకుంటున్నాను. నూతన బాధ్యతలు చేపట్టాక కూడా బిహార్‌తో నా బంధం ఇలాగే కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. కొత్త ప్రభుత్వానికి నా పూర్తి మద్దతు అందిస్తాను' అని నితీశ్ కుమార ÷-ఎక్స్‌లో రాసుకొచ్చారు . నితీశ్ తాజా ప్రకటనతో.. బిహార్‌కు నూతన ముఖ్యమంత్రి ఎన్నిక అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతకే సీఎం పదవీ బాధ్యతలు దక్కవచ్చని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీజేపీ

# ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్

బోధన్: మార్చి 05 జన సంఘర్షణ



బోధన్ పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బోధన్ లోని విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. పలు కేంద్రాలలో లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధన్ పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తనకు వివరాలు తెలియజేయాలని డీ.ఐ.ఈ.ఓ రవికుమార్ ను ఆదేశించారు. గురువారం ఫస్టియర్ గణితం-1బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్ష జరుగగా, ఆయా కేంద్రాలలో పరీక్షలకు గైర్హాజర్ అయిన విద్యార్థుల సంఖ్య గురించి కలెక్టర్ ఆరా తీశారు. విజేత జూనియర్ కళాశాలలో మొత్తం 441 మందికి గాను 12మంది గైర్హాజర్ అయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తెలిపారు. ఉషోదయ కాలేజీలోని సెంటర్ లో 358 మందికి గాను 21 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ అనిల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, విద్యా వికాస్ జూనియర్ కాలేజీ లోని సెంటర్ లో 406 మంది విద్యార్థులకు 398మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజర్ అయినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు కూడా సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకుండా, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బాలికలను మహిళా సిబ్బంది తనిఖీ చేసే ప్రక్రియకు సహకారం అందించాలని ఏ ఎన్.ఎం లకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పక్కాగా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ, ప్రైవేట్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

- బోధన్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ, ప్రైవేట్ డ్రైవర్లకు ఉచిత కంటి, వినికిడి పరీక్షలు

బోధన్: మార్చి 05 జన సంఘర్షణ




తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన " అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం బోధన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించబడింది. లయన్స్ క్లబ్ బోధన్ వారి సహకారంతో అంబులెన్స్, ఆర్టీసీ, స్కూల్ బస్సు, ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా కంటి అలాగే చెవి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణురాలు డా. బెనిట జాన్, ఆడియాలజిస్ట్ డా. బిపిన్ డ్రైవర్లకు పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు.ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మట్లాడుతూ... డ్రైవర్లు రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి కంటి చూపు, వినికిడి సరిగా ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. డ్రైవర్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ , బోధన్ ఎస్, హెచ్, ఓ. వెంకటనారాయణ , బోధన్ పోలీస్ స్టేషన్ లో ఆర్టీసీ, ప్రైవేట్ వాహన డ్రైవర్లకు ఉచిత కంటి, వినికిడి పరీక్షలు, లయన్స్ క్లబ్ ప్రతినిధి భస్వేశ్వర్ రావు, విద్యావికాస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 123 మంది డ్రైవర్లు ఈ వైద్య పరీక్షల్లో పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు కొయ్యరంగాపురం







4. మార్చి..జన సంఘర్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలో కొయ్య రంగాపురం గ్రామంలో షార్ట్ సర్క్యూట్తో దంచమైన ఇల్లు. ఎవరు లేని సమయంలో ఇలా జరిగి ఇంట్లో విలువైన వస్తువులు మొత్తం కాలిపోయాయి. ఇంత జరిగినా అధికారులు ఎవరు ఇటు చూడలేదని బాధ్యతలు రోదిస్తున్నాను. పెళ్లి కోసం దాచుకున్న డబ్బు నగలు వస్తువులు మొత్తం కాలిపోయాయంటూ విలవిలలాడితే పర్వదిస్తున్న బాధితులు ఓట్ల టైంలో ఇంటింటికి వచ్చి మేమున్నాం అంటే ప్రచారం చేస్తూ మమ్మల్ని నమ్మించి మోసంచేసారని అనుకున్నారు. కనీసం ఎమ్మెల్యే కూడా ఇంతవరకు రాలేదని బాధ్యతలు ఆరోపిస్తున్నారు. మమ్మల్ని ఆదుకోవాలని బాధితులు వినిపిస్తూ ప్రార్థిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఎమ్మెల్యే కూడా స్పందించాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నా కూతురు కోసం దాచుకున్న పెళ్లి నగలు డబ్బు మొత్తం తంసమైపోయా అంటూ బాధితులు విలపిస్తున్నారు. మమ్మల్ని ఆదుకోవాల అంటూ బాధితులు వేడుకుంటూ ఉన్నారు. ఇప్పటికైనా మమ్మల్ని ఆదుకోవాలని కోరుకుంటున్నాను. తినటానికి కాలిపోయాయి. నడిరోడ్డు మీద ఉన్నామని బాధితులు రోదిస్తూ విలపిస్తున్నారు.

# వివాహ వేడుకలో ముఖ్య అతిథులను మర్యాదపూర్వకంగా కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

భద్రాద్రి కొత్తగూడెం, ఇల్లందు ప్రతినిధి: (జన సంఘర్షణ)





తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి వివాహ వేడుకకు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన ముఖ్య అతిథులను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల, మధ్యప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు లను ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు బయ్యారం సింగిల్ విండో మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. వివాహ వేడుకలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన రాజకీయ ప్రముఖులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడింది.

# మద్యం మత్తులో తల్లిపై కుమారుడి దాడి...

- ప్రాణాపాయ స్థితిలో మహిళ

భద్రాద్రి కొత్తగూడెం (జన సంఘర్షణ)



జిల్లాలో ఘోర ఘటన చోటుచేసుకుంది. తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన చిట్టిమల్ల లచ్చమను ఆమె కుమారుడు అజీమ్ మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేసిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. సమాచారం ప్రకారం, మద్యం మత్తులో ఉన్న అజీమ్ అకస్మాత్తుగా తల్లి లచ్చమపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో లచ్చమకు రెండు చేతులు, మెడ వద్ద తీవ్ర గాయాలు అయ్యాయి. దాడి అనంతరం ఆమె ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఉండగా స్థానికులు వెంటనే గమనించి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దారుణ ఘటన గ్రామంలో తీవ్ర ఆందోళనకు దారి తీసింది.

# బికనూరూ విద్యార్థుల మధ్య ఘర్షణ..

బిక్కనూర్. మార్చి 5 (జనసంఘర్షణ)





మండల పరిధిలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్ లో మంగళవారం రాత్రి చరిత్ర విభాగం సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థుల ఘర్షణ.

# సచిన్ కుమారుడు అర్జున్ కొడుకు పెళ్లి

జన సంఘర్షణ డెస్క్ : మార్చి 05



సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్ వివాహం గురువారం రోజు ముంబైలో ఘనంగా జరిగింది.ఈ వేడుకకు పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఐసీసీ ఛైర్మన్ జైషా, టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ ధోనీ, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, తన స్నేహితురాలు సానియా చందోక్‌ను మార్చి 5న ముంబైలో వివాహం చేసుకోనున్నారు. ఈ వివాహానికి ముందు, జామ్‌నగర్‌లో ముకేశ్ అంబానీ దంపతులు ప్రీ-వెడ్డింగ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా, తన కుమారుడు ప్రేమించిన అమ్మాయిని ఇంటికి తీసుకువచ్చినప్పుడు తండ్రికి కొడుకు పెద్దవాడయ్యాడని అర్థమవుతుందని, అర్జున్, సానియా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారని, తన కొడుకు తనకు నచ్చిన తోడును వెతుక్కున్నందుకు గర్వంగా ఉందని సచిన్ భావోద్వేగంగా మాట్లాడారు.

# వాసవి సేవా సమితి చిక్కడపల్లి ఆధ్వర్యంలో పౌర్ణిమ అన్న ప్రసాద వితరణ..

- పాల్గొన్న బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 5(జనసంఘర్షణ )



వాసవి సేవా సమితి చిక్కడపల్లి ఆధ్వర్యంలో పౌర్ణిమ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్ పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నవితరణ నిర్వాహక సభ్యులు బాలచందర్, రవీందర్, పర్లేల రమేష్, శ్రీరామ్, నగేష్ చందా, శ్రీనివాస్, బాల్ కుమార్, అముర సాయికృష్ణ, సాయిబాబా, రవిశంకర్, నాగేష్ పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ రవి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లందు ప్రతినిధి (జన సంఘర్షణ):



తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ వివాహ వేడుకలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ చైర్మన్, ఇల్లందు నియోజకవర్గ నాయకులు డాక్టర్ రవి పాల్గొని నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో దీర్ఘకాలం కలిసి జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఈ వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సాగింది. వివాహ కార్యక్రమానికి హాజరైన అతిథులు వధూవరులను ఆశీర్వదించి వారి భవిష్యత్తు శుభంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఇల్లందు పట్టణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నం సత్యనారాయణ, గొడుగు వేణు, ప్రసన్న కుమార్, ముత్యాల లక్ష్మణ్, ఎండి ఇబ్రహీం, మాజీ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ లింగాల జగన్నాథం, వెంకటేష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో వివిధ ప్రాంతాల నుండి రాజకీయ, సామాజిక ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుక ఆత్మీయ వాతావరణంలో ఘనంగా కొనసాగింది.

# మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలి

❑ కలెక్టర్ ఇలాత్రిపాఠి



బోధన్ మార్చ్ 05. (జనసంఘర్షణ)
ఇంటర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పట్టణంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు.పట్టణంలోని పలు కళాశాలల్లో..పట్టణంలోని విజేత జూనియర్ కళాశాల, ఉషోదయ, విద్యా వికాస్ జూనియర్ కాలేజీలలో , కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు జరుగుతున్నాయా లేదా అని గమనించారు. పలు కేంద్రాల్లో లోపాలను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోధన్ పట్టణంలోని అన్ని పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తనకు వివరాలు తెలియజేయాలని డీఐఈవో రవికుమార్ .ను ఆదేశించారు. గైర్హాజరైన విద్యార్థులు.. పరీక్షల్లో భాగంగా గురువారం ఫస్టియర్ గణితం-1బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించిన పరీక్ష జరగగా, ఆయా కేంద్రాల్లో గైర్హాజరైన విద్యార్థుల సంఖ్య గురించి కలెక్టర్ ఆరా తీశారు. విజేత జూనియర్ కళాశాలలో మొత్తం 441 మందికి గాను 12మంది గైర్హాజరయ్యారని చీఫ్? సూపరింటెండెంట్? స్వర్ణలత తెలిపారు. ఉషోదయ కాలేజీలోని సెంటర్‌లో 358 మందికి గాను 21 మంది హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ అనిల్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే, విద్యావికాస్ జూనియర్ కాలేజీలోని సెంటర్?లో 406 మంది విద్యార్థులకు 398 మంది హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా..పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు కూడా సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తేకుండా, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బాలికలను మహిళా సిబ్బంది తనిఖీ చేసే ప్రక్రియకు సహకారం అందించాలని ఏఎన్ఎంలకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పక్కాగా పరీక్షలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి..


ఎల్లారెడ్డి మార్చ్ 05 (జనసంఘర్షణ)



ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మత్తమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ వి.శంకర్ సూచించారు. గురువారం హైస్కూల్లోని పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయ విభజన, సానుకూల దృక్పథం, లక్ష్యములను నిర్దేశించుకుని భవిష్యత్తును మెరుగు దిద్దుకోవాలని సూచించారు. తమ పాఠశాల విద్యార్థులకు మంచి సూచనలు చేసినందుకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అతనిని ఘనంగా సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ గారు ఉపాధ్యాయులు సురేష్, యాదయ్య, కృష్ణంరాజు, అనిల్ కుమార్, లక్ష్మణ్, సృజన్, సుమలత పాల్గొన్నారు.

# మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గోనెల విజయలక్ష్మి మృతి పట్ల సంతాపం

5.. మార్చి... జన సంఘర్షణ
ఉమ్మడి ఖమ్మంజిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు గోనెల విజయలక్ష్మి అనారోగ్యంతో పాల్వంచలో మృతి చెందారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొత్తగూడెం కార్పొరేషన్ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు ఆమె మృతి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం, ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# మంచి మనసుంటే మార్గం ఉంటుందనే జీవంత సాక్ష్యం...

❑ గుంటూరు కుమార్తె నాగం రాజేశ్వరి జీవన గాథ- వేలాది ప్రాణాలకు పునాది
❑ చావుబ్రతుకుల మధ్య పుట్టిన సంకల్పం...



హైదరాబాద్, మార్చి 05,(జన సంఘర్షణ):
గుంటూరులో జన్మించిన నాగం రాజేశ్వరి జీవితాన్ని మార్చేసింది ఒక సంఘటన. రెండో గర్భధారణ సమయంలో కేవలం 2-3 శాతం రక్తంతో చావుబ్రతుకుల మధ్య పోరాడిన ఆ క్షణాలు ఆమె ఆలోచనలకు కొత్త దారితీశాయి. "ప్రాణాలతో బయటపడితే... ఇకపై రక్తం లేక ఎవరు ఇబ్బంది పడకూడదు" అనే సంకల్పం ఆమెను సామాజిక సేవ వైపు మళ్లించింది.

**వేలాది ప్రాణాలకు ఆధారం...** ఆ రోజు చేసిన ప్రతిజ్ఞతోనే ఆమె ఈ రోజు వేలాది మందికి ప్రాణదాతగా నిలిచారు. తన ఆరోగ్యం సహకరించకపోయినా... తాను రక్తదానం చేయలేని పరిస్థితిలోనూ... ఇతర దాతలను సమన్వయం చేసి అవసరమైన వారికి రక్తం అందేలా చేస్తూ సేవ కొనసాగిస్తున్నారు.

**ఫేస్‌బుక్ వేదికగా సేవా విస్తరణ...**
సామాజిక మాధ్యమాలను వేదికగా తీసుకుని,అత్యవసర రక్తదానం,ఆసుపత్రి సహాయం, ఉద్యోగ అవకాశాలు. ఆర్థిక ఇబ్బందులకు మార్గదర్శనం. ఇలా అనేక సమస్యలకు పరిష్కారం చూపుతూ అనేక మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. అవమానాలు... అడ్డంకులు... అయినా సేవే లక్ష్యం. సేవ మార్గంలో ఎన్నో అవమానాలు, బాధలు ఎదురైనా... తన లక్ష్యాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. "సోషల్ సర్వీస్‌కు డబ్బు కంటే గుండెల్లో దమ్ము, ధైర్యం, మంచితనం అవసరం" అనే నమ్మకాన్ని కార్యరూపంలో చూపిస్తున్నారు.
'మంచి మనసుంటే మార్గం ఉంటుంది' -జీవంత ఉదాహరణ...డబ్బులు ఉన్నవారే సేవ చేయగలరు అనే మాటను అబద్ధమని రుజువు చేస్తూ... మంచి మనసు ఉంటే మార్గం స్వయంగా ఏర్పడుతుందని నిరూపిస్తున్నారు నాగం రాజేశ్వరి. తెలుగు రాష్ట్రాల్లో అనేక మందికి రక్తదానం, ఉద్యోగాల విషయంలో సహాయం అందిస్తూ ఆదర్శంగా నిలిచారు.
ఆడది తక్కువ కాదని నిరూపణ ఆడవారు ఏ విషయంలోనూ తక్కువ కాదని, ధైర్యం ఉంటే ఏ కష్టాన్నైనా జయించగలరని ఆమె జీవితం చెబుతోంది. ఎవరు ఏ కష్టంలో ఉన్నా వెంటనే స్పందించి సహాయం అందించడం ఆమె ప్రత్యేకత. తల్లితనం... త్యాగం... సేవా గుణం...ఒక బిడ్డకు జన్మనివ్వాలంటే తల్లి పడే పురిటి నొప్పులు ఎన్నో. బిడ్డ కోసం తాను ఏమైపోయినా పరవాలేదనే త్యాగ భావన తల్లిలో సహజం. అదే తల్లితనాన్ని సమాజానికి పంచుతూ... ప్రతి ప్రాణాన్ని తన బిడ్డలా భావించి కాపాడే సేవాగుణమే రాజేశ్వరిని ప్రత్యేకంగా నిలబెడుతోంది. మెగాస్టార్ అభిమానిగా సేవా స్ఫూర్తి... చిరంజీవి అభిమానిగా సేవా భావాన్ని అలవరచుకుని, రక్తదానంపై అవగాహన కల్పించడంలో ముందుంటున్నారు. రుధిర ప్రదాత-నాగం రాజేశ్వరి. ప్రాణం విలువ తెలుసుకున్న మహిళ...తన బాధను సమాజానికి ఆశగా మలిచిన సేవా తపస్విని...వేలాది మందికి జీవన దీపం వెలిగిస్తున్న స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం-నాగం రాజేశ్వరి.

# గుండుపిన్ని వెంకటేశ్వర్లను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర దిశా ఉమెన్ వెల్ఫేర్ ఉమెన్ ప్రొడక్షన్ కార్యదర్శి కోడెం సీత కుమారి



5.. మార్చి... జన సంఘర్షణ
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాజూలూరుపాడు. మండల సిపిఐ పార్టీ జూలూరుపాడు మండలకార్యదర్శి గుండుపిన్ని వెంకటేశ్వర్లు ఇటీవల యాక్సిడెంట్ లో కాలుకు ప్యాక్చర్ కావడంతో ఖమ్మం ప్రైవేట్ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని తెలంగాణ దిశా ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కార్యదర్శి కోడెం సీతాకుమార్ పరామర్శించడం జరిగింది గుండిపిన్ని త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో లక్ష్మి, మంజుల, సీతా, దనమ్మ లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు సహకారం అందిస్తా...

❑ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్ సిటీ బ్యూరో/ మార్చి 5 ( జనసంఘర్షణ )
ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తన వంతు సహకారం అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు రెండవసారి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా తో సత్కరించారు. అనంతరం ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వి.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి. శివాజీ లు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కూడిన మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు సహకారం అందజేస్తామన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రావు, నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, ఓ.రమేష్ పాల్గొన్నారు.

# హోలీ రోజున రేలకాయలపల్లి సర్పంచ్‌పై దాడి

❑ వేడి నీళ్లు పోసిన గుర్తు తెలియని అగంతకులు
❑ ఘటనపై ఉమ్మడి ఏడు గ్రామాల సర్పంచుల పరామర్శ



ఖమ్మం . సింగరేణి . మార్చ్ 5 ( జన సంఘర్షణ )
హోలీ పండుగ రోజున గేటు రేలకాయలపల్లి గ్రామ సర్పంచ్ మంగ బన్సిపై దాడి జరిగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై వేడి నీళ్లు పోసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనలో సర్పంచ్ మంగ బన్సికి స్వల్ప గాయాలు కావడంతో ఆయనకు స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న ఉమ్మడి ఏడు గ్రామపంచాయతీల సర్పంచులు గేటు రేలకాయలపల్లికి చేరుకుని మంగ బన్సిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఘటనపై ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రజాప్రతినిధులపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రజాప్రతినిధులకు భద్రత కల్పించాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వారు కోరారు.

# డీఎంహెచ్ఓ కు ఎన్.హెచ్.ఎం.కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ జేఏసీ జిల్లా నాయకులు సన్మానం..



కామారెడ్డి మార్చ్ 05: (జన సంఘర్షణ )
కామారెడ్డి డిఎంహెచ్వో డాక్టర్ డి. రవీందర్ గౌడ్ ని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ జేఏసీ జిల్లా నాయకులు జిల్లా ప్రెసిడెంట్ తాళ్లపల్లి సుమన్ డిఎంహెచ్ఓ ని కలిసి సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా ఎన్.హెచ్.ఎం లు కామారెడ్డి జిల్లాలో 530 కి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలియ చేస్తూ ఔట్సోర్సింగ్ లో పనిచేసే ఉద్యోగస్తులకి గత 6 నెలల నుంచి జీతాలు రావడం లేదని తెలియజేయడం జరిగింది. డిఎంహెచ్ఓ సానుకూలంగా స్పందిస్తూ ఔట్సోర్సింగ్ ఏజెన్సీ తో మాట్లాడి మీ సమస్యను పరిష్కరించే దిశగా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది, ఎన్.హెచ్.ఎం. జేఏసీ జనరల్ సెక్రెటరీ పద్మజ జాయింట్ సెక్రెటరీ రాజు ఆర్గనైజింగ్ సెక్రెటరీ అశ్విని, జిల్లా కోఆర్డినేటర్ సాయి కల్యాణ్, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ




ఎడపల్లి ఫిబ్రవరి, 05 (జన సంఘర్షణ)
ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ఉన్న నేపథ్యంలో తాళ్ల సక్కుబాయి గారి జ్ఞాపకార్థంగా తాళ్ల కుటుంబం తరపున విద్యార్థులకి స్టేషనరీ కిట్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాధా కిషన్ గౌడ్, తాళ్ల విజయ్ కుమార్ గౌడ్, తాళ్ల మృతుంజయ్ గౌడ్, తాళ్ల హృషీకేశ్ గౌడ్, ఎన్.బాలరాజ్ గౌడ్, ఎంబ మోహన్, ఆకారం సాయిలు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


## ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి కొత్తపల్లి కిరణ్ ఆర్థిక సాయం

రుద్రూర్: మార్చ్.05( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని అక్బర్ నగర్ గ్రామానికి చెందిన కత్తి గంగారం అనే వ్యక్తి ఇటీవలే రోడ్డు ప్రమాదం లో తీవ్ర గాయాలు కావడంతో. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ నాయకుడు కొత్తపల్లి రవికిరణ్. బాధిత. కుటుంబానికి 5000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపల్లి రవి కిరణ్ చేస్తున్న సేవలు. అభినందనీయమని. పలువురు, ప్రశంసీస్తున్నారు. ఈ కార్యక్రమంలో, రవి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన జిహెచ్ఎంసి ఆడిట్ అధికారి



◆ **రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి**

సికింద్రాబాద్ మార్చ్ 5 (జన సంఘర్షణ)
ప్రభుత్వ అధికారులు అంటే ప్రజాసేవకులని మహాత్మా గాంధీ పలు సందర్భాల్లో చెప్పిన మాట. కానీ నేడు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి రుచిమరిగి కాసులు లేనిదే, ఏ ఫైల్ కూడా కదలడం లేదు. పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శి మొదలుకొని జిల్లా జాయింట్ కలెక్టర్ వరకు అవినీతి కి అలవాటు పడి వారి ఆస్తులను రెట్టింపు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ రెండు నెలల్లోనే 150 మంది వరకు కిందిస్థాయి సిబ్బంది నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు ఏసీబీ అధికారులకు చిక్కారు అంటే తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏ మేరకు పేరుకపోయిందో తేటతెల్లమవుతుంది. తాజాగా సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జిహెచ్ఎంసి ఆడిట్ అధికారి ఏసీబీకి చిక్కారు. రిటైర్డ్ అయిన ఉద్యోగి పింఛన్ ప్రాసెస్ కోసం జిహెచ్ఎంసి ఆడిట్ అధికారి సంతోష్ లంచం అడిగారు. 40 వేలు డిమాండ్ చేయగా గురువారం 35వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకున్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న సింగిరెడ్డి పద్మారెడ్డి

◆ **మొదటిరోజు అంకురారోపణ, యంత్ర ప్రతిష్ట కార్యక్రమాలు**






మల్కాజిగిరి మార్చ్ 05( జనసంఘర్షణ )
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పిఎన్టి కాలనీలో నిర్మిస్తున్న భూ నీళ వెంకటేశ్వర స్వామి నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మార్చి 4,5,6, తేదీలలో మూడు రోజులపాటు వేద పండితులు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. మొదటి రోజు మహోత్సవంలో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో అంకురారోపణ, యంత్ర ప్రతిష్ట కార్యక్రమాలు దిగ్విజయంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో బోడుప్పల్ పీర్జాదిగూడ ప్రజలందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సింగిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

◆ **ఎస్పీ తుషార్ డూడి**



పలమనేరు, మార్చి 05 (జన సంఘర్షణ):
యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్పీతుషార్ డూడి పిలుపునిచ్చారు. గురువారం గంగవరం మండలంలోని మదర్ థెరిస్సా కాలేజీలో నిర్వహించిన "ధైర్య స్పర్శ" అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ఆయన దిశానిర్దేశం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల క్షణికానందం లభిస్తుందేమో కానీ, జీవితాంతం కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని ఎస్పీ హెచ్చరించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించాలని, స్నేహితులు ఎవరైనా మత్తుకు బానిసలైతే వారిని మార్చే ప్రయత్నం చేయాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల పెరుగుతున్న 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాల గురించి విద్యార్థులను అప్రమత్తం చేశారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని, బ్యాంక్ వివరాలు, ఎవరికీ చెప్పకూడదని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల్లో యువత ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తూ, కాలేజీ విద్యార్థులకు స్వయంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. త్వరలోనే జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. వరుసగా 28 రోజుల పాటు హెల్మెట్ ధరించి ఫోటోలు పంపిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు "మహిళల భద్రత మనందరి బాధ్యత" అనే అంశంపై ప్రదర్శించిన మైమ్ (ముగభినయం) అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, పలమనేరు ఎస్డీపీఓ ప్రభాకర్, ఇన్స్పెక్టర్లు రాంభూపాల్, మురళీమోహన్, కాలేజీ కరెస్పాండంట్ రవీంద్ర బాబు, చైర్మన్ సునీల్, డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, ఎస్సైలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ జర్నలిస్టులు సురేష్ యాదవ్, ధనంజయ చారి

◆ **పరామర్శించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న.**





హైదరాబాద్, మార్చి 05,(జన సంఘర్షణ):
ఆఫీస్ పని మీద కూకట్ పల్లి నుండి జూబ్లీహిల్స్ ప్రాంతంలోనీ తన కార్యాలయం వద్ద వెళుతున్న ఇద్దరు సీనియర్ జర్నలిస్టులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి డికొట్టిన ఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలపాలైన చికిత్స పొందుతున్నా మిత్రులను తన స్వగృహంలో కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న పలకరించి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలలో పని చేస్తున్న విలేకరులపై అక్కడ పని చేసే కొందరు తమ సొంత పనులకు వాడుకుంటూ ఇలాంటి రోడ్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని,కావున విలేకర్లు కూడ చూసి పని చేయాలని సూచించారు.ఇలాంటి ప్రమాదాలకు బాధ్యులు ఎవరు అని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రమాదంలో గాయపడిన సీనియర్ జర్నలిస్టులు సురేష్ యాదవ్,ధనంజయ చారి కోలుకోవడానికి సుమారు మూడు నెలల సమయం పడుతుందని, ఈ సమయం కుటుంబ పోషణ ఎలా ఉంటుందో ఒక్కసారి యాజమాన్యాలు ఆలోచన చేయాలని కోరారు. కావున స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ కోశాధికారి పుట్టి నగేష్ ముదిరాజు, జాయింట్ సెక్రెటరీ నాగుల అంజిబాబు పద్మశాలి నేత, వరుడు సుజాత నాయుడు తదితరులు పాల్గొన్నారు.


## పోతంగల్ మండలంలోని అంగన్వాడీ టీచర్లు సిఐటియు యూనియన్‌లో చేరిక



పోతంగల్ మార్చి 5 (జన సంఘర్షణ)
సిఐటియు జిల్లా అధ్యక్షులు జమ్మిశెట్టి శంకర్ గౌడ్, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు విక్టోరియా రాణి, శ్యామల వారికి కండువాలు వేసి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థ ఏర్పడ్డ నాటి నుండి సిఐటియు వారి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు ఉద్యమాలు చేసిందని అన్నారు. అంతేకాదు అనునిత్యం వారు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని పోరాడిందని అన్నారు. సిఐటియు నుండివెళ్లిన కార్మికులు తిరిగి సీఐటీయూలోకి రావడం ఆనందంగా ఉందని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కనీస వేతనం 26వేల రూపాయలు ప్రభుత్వం వాళ్లని కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేయడం జరిగింది. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలైనా వారి బెనిఫిట్స్ ఇవ్వకపోవడం సిగ్గుచేటన్ని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన బెనిఫిట్స్ ని అంగన్వాడి కార్మికులకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు పోరాటాలు చేయవలసి వస్తుందని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించడం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జయశ్రీ, సాయమ్మ గంగమ్మ, స్వరూప, ద్రౌపతి మొదలగువారు పాల్గొన్నారు.

## చదువు ఒక్కటే పేదరికం అనే చీకటిని చీల్చుతూ.. వెలుగులు నింపే ఆయుధం...

◆ **ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు.**



శ్రీకాళహస్తి మార్చి 05 (జన సంఘర్షణ):
"చదువు ఒక్కటే పేదరికం అనే చీకటిని చీల్చుతూ వెలుగులు నింపే ఆయుధం. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే తల్లిదండ్రుల కలలు సాకారమవుతాయి" అని ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు పిలుపునిచ్చారు. గత తొమ్మిదేళ్లుగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తూ తన సేవా గుణాన్ని చాటుకుంటున్న ఆయన, గురువారం శ్రీకాళహస్తి మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 246 మంది విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. "విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి. కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడమే మీరు నాకు ఇచ్చే అసలైన బహుమతి." అని ఈ సందర్భంగా యల్లంపాటి కోటేశ్వరబాబు విద్యార్థులకు ఉద్బోధించారు. తొమ్మిదేళ్లుగా నిరంతర సేవాయజ్ఞం. పరీక్షల సమయంలో పేద విద్యార్థులకు భరోసానివ్వాలనే లక్ష్యంతో కోటేశ్వరబాబు ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహిస్తున్నారు. కేవలం శ్రీకాళహస్తికే పరిమితం కాకుండా తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలతో పాటు సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలంలో కూడా వందలాది మంది విద్యార్థులకు ఆయన అండగా నిలుస్తున్నారు.విద్యార్థులకు అండగా... శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు, అక్కుర్తి, ముచ్చివోలు, వాంపల్లి, వెలంపాడు, ఓబులాయిపల్లి, రాచగున్నేరి, తొండమనాడు, ఎగువ వీధి ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం మార్కుల కోసం కాకుండా, విలువల గల మనుషులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒక జర్నలిస్టుగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, సామాజిక స్పృహతో విద్యార్థుల భవిష్యత్తు కోసం కోటేశ్వరబాబు చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

## శ్రీకాళహస్తి దేవస్థానం నూతన ఈవోగా బి కే వెంకటేశులు



శ్రీకాళహస్తి మార్చి 05 (జన సంఘర్షణ):
శ్రీకాళహస్తీశ్వర స్వామి శ్రీకాళహస్తి దేవస్థానం నూతన ఈవోగా బి కే వెంకటేశులు, ( స్పెషల్ గ్రేట్ డిప్యూటీ కలెక్టర్) గురువారం చార్జి తీసుకున్నారు. అనంతరం వారు కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనానికి విచ్చేశారు. వారికి దేవస్థానం చైర్మన్ కొట్టేసాయి, ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయ దర్శనము, వేద ఆశీర్వచనం ఏర్పాటు. అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధానంలో శ్రీకాళహస్తి ఆలయ కార్యనిర్వాహణాధికారిగా చార్జి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి, బోర్డు సభ్యులు నాగరాజు, రాఘవయ్య, డి ఈ ఓ కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ ఏ ఈ ఓ లు మోహన్, హేమామాలిని, లోకేష్ బాబు, పర్యవేక్షకులు నాగభూషణం, రవి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, పురోహితులు అర్ధగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు

**తిరుపతి, మార్చి 05(జన సంఘర్షణ):** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపిఎస్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, పాఠశాలలు, మహిళా ప్రాంగణాలు, వాణిజ్య సముదాయాల వద్ద మహిళల భద్రత, సైబర్ నేరాలు, సామాజిక మోసాలు తదితర అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాలలో పోలీస్ అధికారులు, శక్తి టీమ్ సభ్యులు పాల్గొని మహిళలు, బాలికలకు ప్రస్తుత సమాజంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరణాత్మకంగా సూచనలు అందించారు. మహిళల భద్రత గురించి మాట్లాడుతూ మహిళలు ప్రజా ప్రదేశాలలో, విద్యాసంస్థలలో, కార్యాలయాలలో మరియు ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించేలా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. మహిళా సాధికారత గురించి తెలుపుతూ మహిళలు స్వయం నమ్మకంతో ముందుకు సాగాలని, విద్య, ఉపాధి మరియు ఆర్థిక స్వావలంబన ద్వారా సమాజంలో గౌరవ స్థానం పొందగలరని వివరించారు. చట్టాలు మహిళల రక్షణ కోసం ఉన్నాయని, తమ హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు రావాలని ప్రోత్సహించారు. ఆత్మరక్షణ గురించి అవగాహన కలిగిస్తూ బాలికలు, మహిళలు ప్రాథమిక ఆత్మరక్షణ పద్ధతులు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ఎలా తప్పించుకోవాలి, సహాయం ఎలా కోరుకోవాలి అనే అంశాలపై ప్రాక్టికల్ సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత



సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని హెచ్చరించారు. నకిలీ కాల్స్, ఫేక్ లింక్స్, సోషల్ మీడియా మోసాల గురించి ఉదాహరణలతో వివరించారు. ఆన్లైన్ గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బు సంపాదన పేరుతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. తెలియని యాప్స్ డౌన్లోడ్ చేయకూడదని, చిన్నారులు గేమింగ్కు బానిస కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. లోన్ యాప్ మోసాలు పై అవగాహన కల్పించారు . అధిక వడ్డీతో తక్షణ రుణాలు ఇస్తామని చెప్పే నకిలీ లోన్ యాప్స్పై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత ఫోటోలు, కాంటాక్ట్స్ దుర్వినియోగం చేస్తున్న ఘటనలను వివరించి, చట్టబద్ధమైన బ్యాంకులు లేదా గుర్తింపు పొందిన సంస్థల ద్వారానే రుణాలు పొందాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం చట్టరీత్యా శిక్షార్హమని వివరించారు. సమాజం మొత్తం కలిసి ఈ వ్యసనాల నిర్మూలనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.
సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, లొకేషన్ వివరాలు పంచుకునే ముందు జాగ్రత్తగా ఆలోచించాలని సూచించారు. ఫేక్ అకౌంట్లు, మోసపూరిత ప్రలోభాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సంప్రదించాల్సిన హెల్ప్లైన్ నంబర్ల గురించి వివరించారు. డయల్ 112 అత్యవసర సేవ, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930, మహిళా భద్రతకు సంబంధించి పోలీస్ స్టేషన్లను లేదా శక్తి యాప్ను ఉపయోగించవచ్చని తెలిపారు. విద్య ద్వారా మాత్రమే మహిళలు, బాలికలు తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని వివరించారు. మంచి విలువలు, నైతికత, క్రమశిక్షణతో ముందుకు సాగితే సమాజం గౌరవాన్ని పొందగలరని చెప్పారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు పోలీసుల సూచనలను శ్రద్ధగా విని, భవిష్యత్తులో అప్రమత్తంగా ఉండాలని సంకల్పించారు. మహిళల భద్రత కోసం తిరుపతి జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తూనే ఉంటారని అధికారులు తెలిపారు.

# స్విమ్స్ కార్మికులకు తక్షణం వేతనాలు పెంచాలి

- **శానిటేషన్ హోదాను రద్దు చేసి వార్డుబాయ్‌లుగా పరిగణించాలి**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్**

**తిరుపతి మార్చి 05(జన సంఘర్షణ):** తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ వద్ద స్విమ్స్ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు నేడు ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన వి. శ్రీనివాసరావు కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు అడుగుతున్న డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని, యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా సుమారు ఎనిమిది వందల మంది కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ వినతిపత్రాలు సమర్పించినప్పటికీ, పరిష్కారం చూపకుండా కాలయాపన చేయడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. పేద కార్మికుల సమస్యలను ఇంతకాలం పెండింగ్‌లో ఉంచడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానాలు యాజమాన్యం జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు వాస్తవానికి వార్డుబాయ్‌లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారిని




శానిటేషన్ కార్మికులుగా చూపించి తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమని వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శానిటేషన్ హోదాను రద్దు చేసి వారిని వార్డుబాయ్‌లుగా పరిగణించి తగిన వేతనాలు చెల్లించాలని ఆయన స్పష్టం చేశారు. అధికారులు గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కూడా డిమాండ్ చేశారు. స్విమ్స్ వంటి ప్రముఖ వైద్య సంస్థలో దళితులు, మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్న కార్మికులపై ఇలాంటి వివక్షత చూపించడం సమంజసం కాదని ఆయన అన్నారు. పేద, కష్టజీవి కార్మికుల శ్రమపై ఆసుపత్రి సేవలు కొనసాగుతుండగా, వారి సమస్యలను పట్టించుకోకపోవడం ప్రభుత్వ పాలనా విధానంపై ప్రశ్నలు తలెత్తిస్తున్నదన్నారు. స్విమ్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని, హోదా మార్పు చేసి వార్డుబాయ్‌లుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం ఆలస్యం చేస్తే ఉద్యమం మరింత విస్తరించే పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. కార్మికుల హక్కుల సాధన కోసం సిపిఎం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వి. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షులు ఎస్ జయచంద్ర, సిఐటియు నేతలు కే వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవ్, నగర అధ్యక్షురాలు పి బుజ్జి, స్విమ్స్ వర్కర్స్ జి రవి బి.సూరి గోపి మునికృష్ణ వెంకటేష్ జయమ్మ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు పంచాయతిని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయండి

- **ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి**

**నెల్లూరు జిల్లా మార్చి 05(జన సంఘర్షణ):** పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం గ్రామాలను కోవూరు మున్సిపాలిటీలో విలీన ప్రతిపాదన. బుచ్చిరెడ్డి పాళెం మున్సిపాలిటీలో శాఖల వారీగా సిబ్బంది మరియు అభివృద్ధికై నిధులు కేటాయించండి. మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయాలన్న కోవూరు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మంత్రి నారాయణ హామీ. శాసనసభ సమావేశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేసిన విజ్ఞప్తులకు ప్రభుత్వం నుండి సానుకూల స్పందన లభించింది. రాష్ట్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం మరియు తాగునీటి సరఫరా కోసం కూటమి ప్రభుత్వం 14 వేల 539 కోట్లు కేటాయించి పట్టణాభివృద్ధికి బాటలు వేసిందని ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు పురపాలక శాఖ మంత్రి నారాయణ లకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో కూడా ఏపీ మున్సిపాలిటీలు ముందంజలో ఉన్నాయని ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాళెం పురపాలక సంఘంలో నిధుల కొరతను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రేడ్-2 స్థాయికి తగ్గట్టుగా సిబ్బంది నియామకం, డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి అదనపు నిధులు కేటాయించాలని ముఖ్యంగా గుడిపల్లి మరియు రేబాల కాలువల వద్ద సైడ్ రివిట్‌మెంట్ తో పాటు ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన పురపాలక శాఖ మంత్రి నారాయణ, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ అభివృద్ధికి తగిన నిధులు కేటాయిస్తామని సభలో హామీ ఇచ్చారు. ?దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కోవూరు గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. 40 వేల పైగా జనాభా ఉన్న కోవూరుతో పాటు, భౌగోళికంగా కలిసిపోయిన పడుగుపాడు మరియు పోతిరెడ్డిపాలెం పంచాయతీలను విలీనం చేస్తే దాదాపు



75 వేల జనాభా అవుతుందని తద్వారా ఆ ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. దీనిపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందిస్తూ స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.

# పంటలపై ఒంటరి ఏనుగు దాడి

**పలమనేరు, మార్చి 05(జన సంఘర్షణ):**



పలమనేరు రూరల్ మండలంలోని మొసలి మడుగు గ్రామం, ఏటిగడ్డ గ్రామాలకు చెందిన రైతులు పంట పొలాలపై ఒంటరి ఏనుగు బుధవారం రాత్రి దాడి చేసింది. దీంతో చంద్రశేఖర్ నాయుడు అనే రైతుకు చెందిన అర్థ ఎకరాపైన వరి పంట, ఏటిగడ్డ గ్రామానికి చెందిన మురగేష్ అనే రైతుకు చెందిన అరటి తోట,ఉమాపతి నాయుడు అనే రైతుకు చెందిన పూత దశలో ఉన్న మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి కాయలతో ఉన్న సపోటా చెట్లతో పాటు మొక్కజొన్న పంటను పూర్తిగా ధ్వంసం చేసి నష్టపరచడంతో రైతులు సతమతమౌతున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ రెండు చోట్ల పలువురు రైతులకు చెందిన వరి,మామిడి, అరటి,సపోటా, మొక్కజొన్న, పశుగ్రాసం తదితర పంటలను పూర్తిగా ధ్వంసం చేసి నష్టపరిచిందని భాధిత రైతులు వాపోతున్నారు. ఈ ఒంటరి ఏనుగు సంచారాన్ని శుక్రవారం ఉదయం గమనించిన రైతులు అటవిశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే బీట్ ఆఫీసరు యుగంధర్ తదితరులు వచ్చి నష్టమైన పంటలను పరిశీలించారు.ఈ ఒంటరి ఏనుగు ఏటిగడ్డ గ్రామానికి సమీపంలో ఉన్న అడవిలోనే ఉన్నదని మళ్ళీ రాత్రికి సమీపంలోని పంటపొలాలపై రావచ్చునని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఏనుగులు సంచారం తగ్గాయి.అయితే మళ్ళీ ఈ ప్రాంతంలో ఒంటరి ఏనుగు దాడులు మొదలయ్యాయి. ఈ ఒంటరి ఏనుగును వెంటనే డ్రైవ్ చేసి రోడ్డుకు అవతల వైపుకు మళ్ళించాలని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని పలమనేరు రేంజర్ నారాయణకి రైతులు చెప్పడంతో అధికారి స్పందించి రాత్రికి ట్రాకర్సులను పంపుతామని రైతులకు సమాచారం ఇచ్చారు.

# కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో వికలాంగుల సాధికారతపై అవగాహన కార్యక్రమం



**కుప్పం, మార్చి 05(జన సంఘర్షణ):** కుప్పం ఇంజినీరింగ్ కళాశాల (ఆటానమస్)లోని ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో వికలాంగుల సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాలలోని సర్ సి.వి. రామన్ ఆడిటోరియంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని వికలాంగుల సాధికారత విభాగం లో కమిషనర్‌గా పనిచేస్తున్న ఎస్. గోవిందరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వికలాంగులకు సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలు మరియు సమాజం కలిసి వికలాంగులకు అనుకూలమైన వాతావరణం, సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు జగన్నాథన్ పరిచయ ప్రసంగం చేశారు. వికలాంగుల సాధికారత కోసం సమాజంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సుధాకర్ బాబు మాట్లాడుతూ, వికలాంగులకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన మరియు ఆవిష్కరణలు వికలాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు.కార్యక్రమం చివరగా అతిథిని కళాశాల తరపున సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. బాస్కరన్, పీఆర్ఓ ప్రవీణ్ కుమార్, స్పందన్ ఎన్‌జీఓలు, సామాజిక కార్యకర్తలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత మెడికల్ హెల్త్ చెక్-అప్ శిబిరం కార్యక్రమంలో డాక్టర్ చంద్రప్ప




**శ్రీకాళహస్తి, మార్చి 05(జన సంఘర్షణ):** ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రం ఆధ్వర్యంలో 8వ జన్ ఔషధీ దివస్-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ఉచిత మెడికల్ హెల్త్ చెక్-అప్ శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడి వీధి, ఏడు గంగమ్మ గుడి పక్కన ఉన్న ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ కే. వెంకట భాస్కర్, ఎంబిబిఎస్, ఎండీ, జనరల్ సర్జన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, బీడబ్ల్యూఎఫ్ డిస్పెన్సరీ, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, ఏపీ ఫార్మా కౌన్సిల్ సభ్యుడు రాము, శ్రీకాళహస్తి మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రావు, ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఫార్మసిస్ట్ అరుణ, షాప్ యజమాని డా.సూర్య. తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో ఉచితంగా షుగర్ పరీక్షలు, రక్తపోటు (బీపీ) పరీక్షలు నిర్వహించడంతో పాటు బరువు పరిశీలించి డాక్టర్లు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మందుల ఖర్చు సాధారణ ప్రజలపై భారం అవుతోందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి జన్ ఔషధ కేంద్రాల ద్వారా సుమారు 70 శాతం వరకు మందుల ధరలు తగ్గి ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని తెలిపారు.

## ఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి



**శంకరపట్నం జన సంఘర్షణ**

ఇంటింటికి ఇనుకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ సూచించారు. శంకరపట్నం మండలం కాచాపూర్ రైతు వేదికలో వాడు సభ్యులకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు ఈ శిక్షణ శిబిరానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని సూచించారు.గ్రామంలో ప్రతి వ్యక్తి పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. జెడ్పి డిప్యూటీ సీఈఓ గా పదవినోతి పొందిన ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ ను గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్,కాచాపూర్ సర్పంచ్ ఊకంటి మాధవి, కార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రూ.151 చెల్లిస్తే ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు



**జహీరాబాద్ జన సంఘర్షణ**

శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా భద్రాచలం తలంబ్రాలను భక్తుల ఇళ్లకు చేరవేసేందుకు టీజీ ఎస్ ఆర్ టి సి లాజిస్టిక్స్ శ్రీకారం చుట్టింది. రూ.151 చెల్లించి ఆర్టీసీ వెబ్సైట్ లేదా లాజిస్టిక్స్ కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చని జహీరాబాద్ డిపో ఏటీఎం డి. శ్వేత తెలిపారు. మార్చి 27న జరిగే కల్యాణం అనంతరం ఈ తలంబ్రాలను పంపిణీ చేస్తారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల అందజేత

**-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా 8 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం**

**- బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమం**





**ఉప్పల్ జన సంఘర్షణ :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల కు ఆర్థిక సహాయం అందించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొత్తం 8 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు వారి వైద్య విద్యకు అయ్యే ఫీజుల కోసం చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, వైద్య విద్య చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, కాప్రా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్, చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు

**ఉప్పల్ జన సంఘర్షణ :**



కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేయడంపై ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా సేవలందిస్తున్న వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అభ్యర్థిత్వం దక్కడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా గురువారం వేం నరేందర్ రెడ్డిని ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు మందుముల పరమేశ్వర్ రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ మాజీ ప్రధాన

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు సహకారం అందిస్తా:మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పల్ జన సంఘర్షణ :**

ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తన వంతు సహకారం అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియూడబ్ల్యూజే) మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు రెండవసారి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా తో సత్కరించారు. అనంతరం ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి.శివాజీ లు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కూడిన మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు సహకారం అందజేస్తామన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు..ఈ





కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రావు, నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, ఓ.రమేష్ పాల్గొన్నారు.





# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాం ప్రత్యేక సమావేశం

**అన్నపురెడ్డిపల్లి జన సంఘర్షణ :**

కలెక్టర్ గారి ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయం నందు గురువారం ఉదయం 11.00 గంటలకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాం (99 రోజుల ప్రణాళిక)పై సన్నాహక సమావేశం సర్పంచులు, కార్యదర్శులు మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంకు మండల ప్రత్యేకాధికారి పరందామారెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జిల్లా హౌసింగ్ అధికారి రవీందర్, సమావేశంలో చర్చించిన అంశాలు 6 వతేది నుంచి 15 వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు ప్రభుత్వ కార్యాలయంలో ఫైల్ లు పెండింగ్ లేకుండా చూడాలని తెలియజేశారు. మొదటి రోజు ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామంలో ట్రాన్సట్ వాక్ చేసి సమస్యలు గర్తించాలి, గుర్తించిన సమస్యలు షెడ్యూల్ వారీగా పూర్తి చేస్తూ వెళ్ళాలి, అందుకు కావలిసిన, కూలీలు మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలి.

1)రోడ్లు, డ్రైనేజీ లు శుభ్రం చెయ్యాలి , మురుగు నీరు పారేలా చూడాలి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి.

డ్రైన్ చివరిలో సోక్ పిట్ తవ్వించాలి.

2)ప్రభుత్వ కార్యాలయంలు శుభ్రం చెయ్యాలి

పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లు, పీహెచ్ సి –సబ్ సెంటర్లు, శుభ్రం చెయ్యాలి.

బస్సు స్టేషన్స్ శుభ్రం చెయ్యాలి.

3) ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్స్ శుభ్రం చెయ్యాలి,



క్లోరినేషన్ చేపించాలి.

4) నర్సరీలలో అన్ని బ్యాగ్స్ లలో విత్తనంలు నాటాలి, షేడ్ నెట్ ఏర్పాటు చెయ్యాలి.

5) కంపోస్ట్ షెడ్స్ మంచిగా నిర్వహించాలి.

6) ఈ వేస్ట్ ప్రొపెర్ గా డిస్పోస్ చెయ్యాలి

పార్కుక్ లను శుభ్రం ఉంచాలి

7) చికెన్ వ్యాపారూలతో, ఎక్కువ మొత్తంలో చెత్త వచ్చే వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి వారి చెత్త మంచిగా డిస్పోజ్ చేసుకొనే విధంగా అవగాహన కల్పించాలి.

8) ఫ్రైడే డ్రై డే ఆక్టివిటీస్ నిర్వహిస్తూ చెరువులు, కాలువలు శుభ్రంగా ఉండేలా చూడాలి.

9) మల్టీ పర్పస్ కూలీలకు సన్మానం చెయ్యాలి మరియు వారికోసం హెల్త్ క్యాంపు పెట్టించాలి, కిట్స్ అందించాలి

పై కార్యక్రమాలు చేసే క్రమములో పనిచేసిన ముందు పని చేసిన తర్వాత ఫోటోలు తప్పక నిర్వహించాలి.స్టేట్ లెవెల్ నుంచి వచ్చే అధికారులకు ఈ ఫొటోస్



చూపించునట్లు చూసుకోవాలి. ఈ ప్రోగ్రాం లో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయ మిత్రులు పాల్గొని విజయవంతం చెయ్యాలి. అదే విధంగా మండల ప్రత్యేక అధికారి ఎస్ సి బాయ్స్ రెసిడెన్సియల్ పాఠశాలలో/ కళాశాలలో విద్యార్థులతో కల్సి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ, ఎంపీవో, ఎంఈఓ పంచాయతీ కార్యదర్శు కాలేజీ ప్రిన్సిపాల్ మండల ప్రత్యేకాధికారి తదితరులు పాల్గొన్నారు.

# మనిషిలోని చైతన్యమే పరమాత్మ

**మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి**

**వైభవంగా శంకరాచార్య విగ్రహావిష్కరణ**

**జహీరాబాద్ జన సంఘర్షణ**

అహం బ్రహ్మాస్మి, అయమాత్మా బ్రహ్మ, తత్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ అనే నాలుగు వేద మహావాక్యాలను ప్రపంచానికి తెలియజేసి భారతీయ సనాతన ధర్మాన్ని ప్రచారం చేసిన గొప్ప సద్గురువు ఆదిశంకరాచార్యులు అని అని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్,మహామండలేశ్వర్, డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ పేర్కొన్నారు. గురువారం ఆలయ ఆవరణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి విగ్రహావిష్కరణను మాతృశ్రీ అనసూయ మాత చేతుల మీదుగా భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. అంతకుముందు శంకరాచార్యుల విగ్రహాన్ని బర్దిపూర్ మాడ వీధుల్లో ఘనంగా ఊరేగింపుగా నిర్వహించారు. గణపతి పూజ, మహా మృత్యుంజయ యజ్ఞం, దత్త యజ్ఞం, పూర్ణాహుతి అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య భక్తుల సమక్షంలో జగద్గురు ఆది శంకరాచార్యులు శంకరాచార్యుల విగ్రహాన్ని వైభవంగా ఆవిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల దేవాలయ కమిటీలు సహకరిస్తే లేదా దత్తగిరి చారిటబుల్ ట్రస్టును సంప్రదిస్తే, అక్కడ శంకరాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తామని



దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం ప్రకటించారు. అల్లాడి వీరేశం భక్తి సేవలను గుర్తించి రంబాపురి జగద్గురువులు దాన విశారద అనే బిరుదులు అందించారు. అదేవిధంగా జహీరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉజ్వల రెడ్డి విగ్రహాల ఏర్పాటుకు సహకరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తడూల్ ఆశ్రమ పీఠాధిపతి రాజేశ్వర శివాచార్య,విశ్వ మానవ ధర్మ ప్రచార పరిషిత్ సభ్యులు నీల వెంకటేశం, పునీత్ దీక్షిత్, నర్సింగ్ రావు, రాజు పాటిల్, , ప్రసాద్, సాయి రెడ్డి విట్టల్ రెడ్డి, బెజగం రాజయ్య, రాజేశ్వర్ సెట్, పాల్గొన్నారు. ఉత్సవాలు వీక్షించేందుకు జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, వికారాబాద్, బీదర్, సదాశివపేట్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు తగు ఏర్పాటు చేశారు.

# సదాశివపేటలో నకిలీ సిగరెట్ల కలకలం

**గోల్డ్ ప్లేక్ లైట్స్ పేరుతో డూప్లికేట్ ప్యాకెట్లు**

**తక్కువ ధరకు మార్కెట్లో విక్రయం**




**సంగారెడ్డి** జన సంఘర్షణ

సంగారెడ్డి జిల్లా సదాశివపేట ప్రాంతంలో నకిలీ సిగరెట్ల దందా జరుగుతున్నట్లు వినియోగదారుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రముఖ సంస్థ ఐటీసీ లిమిటెడ్ కు చెందిన గోల్డ్ ఫ్లాకే లైట్స్ పేరుతో డూప్లికేట్ సిగరెట్లు మార్కెట్లో విక్రయమవుతున్నట్లు సమాచారం. పట్టణంలోని కొన్ని రిటైల్ దుకాణాల్లో ఈ ప్యాకెట్లు లభ్యమవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అసలు బ్రాండ్కు పోలికగా ప్యాకింగ్ ఉండటంతో తేడా గుర్తించడం కష్టంగా మారిందని తెలిపారు.మార్కెట్ ధర కంటే 30--40 శాతం తక్కువకు ఈ ప్యాకెట్లు సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది. అధికారిక డీలర్లకు బదులుగా మధ్యవర్తుల ద్వారా సరుకు వస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నకిలీ సిగరెట్ల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయ నష్టం కలిగే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ దందాపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వినియోగదారులు అధికారిక డీలర్ల వద్ద నుంచే సిగరెట్లు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు

# శాత్రాజుపల్లిలో వార్డ్ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**-రజక సంఘం ఆధ్వర్యంలో సంగ అనుమావ్వ,గుడిసె సంతోష**

**-కరుణాకర్లకు అభినందనలు**

**-గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలకు ప్రశంసల వెల్లువ**



**వేములవాడ టౌన్ జన సంఘర్షణ :**

వేములవాడ మున్సిపల్ పరిధిలో విలీనమైన శాత్రాజుపల్లి గ్రామంలో ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం నిర్వహించారు. శాత్రాజుపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో 1వ వార్డ్ కౌన్సిలర్ సంగ అనుమావ్వ మరియు 3వ వార్డ్ కౌన్సిలర్ గుడిసె సంతోష--కరుణాకర్లను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లు చూపుతున్న చొరవను గుర్తించి ఈ సన్మానం నిర్వహించినట్లు సంఘ నాయకులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్యను స్పందనతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు గ్రామంలో రహదారులు, తాగునీరు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ప్రజల సహకారంతో శాత్రాజుపల్లిని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు వనపర్తి గంగయ్య, ఉపాధ్యక్షుడు పొన్నాల శ్రీకాంత్, సంఘ సభ్యులు పొన్నాల మోహన్, వనపర్తి జగన్, పొన్నాల పుల్లయ్య, పొన్నాల లక్ష్మీరాజ్యం, చింతలతాడెం సతీష్, పొన్నాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు సభ్యులతో సమన్వయ కమిటీ......

**నమిల గ్రామ శాఖ అధ్యక్షుని ఎన్నికతో బహిర్గతమైన కాంగ్రెస్ విభేదాలు....**

**రాజాపేట, మార్చి 5 జన సంఘర్షణ :**

రాజాపేట మండలం నమిల గ్రామంలోని కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. ఇటీవల సర్పంచి పులి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ చెల్లనేరదంటూ మండల పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్ చేసిన ప్రకటనతో దుమారం లేచింది. దీంతో జిల్లా పార్టీ అధ్యక్షులు అయిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వద్దకు పంచాయతీ చేరింది. ఎందుకురా జిల్లా అధ్యక్షుడు సూచనల మేరకు నమిల గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక సమావేశం జరగగా మండలంలోని పలువురు పార్టీ పెద్దలు హాజరయ్యారు. వాదోపవాదాలు దూషణల మధ్య సమావేశం కొనసాగింది. పెట్టకేలకు ఐదుగురు సభ్యుల సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. ఇటీవల జరిగిన గ్రామ శాఖ పక్కకు పెట్టాలని పక్షం రోజుల్లో సమన్వయ కమిటీ చేసిన నిర్ణయం మేరకు నడుచుకోవాలని తీర్మానించుకున్నారు.

# న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**ధర్మసాగర్ జన సంఘర్షణ :**

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ఆయా గ్రామాల్లోకి ప్రజల జీవన శైలి, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా జరిగే నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు, బీట్లు, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణ పై స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్ కు సంబంధించి రికార్డులను సీపీ పరిశీలించారు.అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవహరించకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సీపీ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తో పాటు, ఎస్. ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





# ఇఫ్తార్ విందులో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి


**ఉప్పల్ జన సంఘర్షణ :**

ఉప్పల్ కుతుబ్షాహి పెద్ద మజీద్ కాంగ్రెస్ నాయకులు అలా భాష ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి, ఉపవాస దీక్షలో ఉన్నవారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం గొప్ప సేవా కార్యక్రమమని అల్లా భాషా గారిని ప్రశంసించారు. మతసామరస్యం, ఐకమత్యం సమాజానికి బలం అని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో అజ్జు, ఖాజా మౌలానా నాగూర్ భాష మల్లికార్జున్, అన్వర్ పాషా, అఫ్జల్ పాషా, ఈగ అంజయ్య, తుమ్మల దేవి రెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, మోహన్ నాయక్, శేఖర్, భాష భాష, ఖాదర్ బాషా కుతుబ్షాహి ఉప్పల్ పెద్ద మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు మరియు పట్టణ ప్రజలు తదితరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.



విలేకరులు కావలేను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
జన సంఘర్షణ దిన పత్రికలో పనిచేయుటకు
జిల్లాల వ్యాప్తంగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గల
వారికి ఆర్.సి. ఇంచార్జీలు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సహం కలిగిన యువతి,
యువకులు కావలేను. సీనియర్‌లకు ప్రధాన్యత ఇవ్వబడును



వివరాలకు సంప్రదించండి 63050 26524

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co